క్లుప్తంగా

కుండపోత వర్షం



పెనుగంచిప్రోలు: వాయుగుండం ప్రభావంతో పెనుగంచిప్రోలు మండలంలో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. శనివారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం పడుతుండటంతో పాటు మునేరుకు ఎగువన ఖమ్మం, వరంగల్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు మరోసారి మునేరుకు భారీగా వరద వచ్చింది. మునేరు కాజ్‌వేకు ఆనుకుని వరద నీరు ప్రవహిస్తోంది. పెనుగంచిప్రోలులో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, రెవిన్యూ, పోలీస్ అధికారులు లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు.

మునేటికి మళ్లీ వరద తాకిడి



లింగాల(వత్సవాయి): మునేటికి ఎగువప్రాంతమైన తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలు పడుతుండటంతో మునేటికి ఆదివారం వరద తాకిడి పెరిగింది. పది అడుగుల మేర సుమారు 50 క్యూసెక్కుల వరదనీరు వచ్చినట్లు ఇరిగేషన్ ఏఈ ఆర్ రామనరసింహరావు తెలిపారు. ఇప్పటికే లింగాల కాజ్‌వే దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాజ్‌వేపై గండ్లు పూడ్చేందుకు టిప్పర్ల ద్వారా తోలిన మట్టి వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. కాజ్‌వే దెబ్బతినడంతో వత్సవాయి నుంచి జగ్గయ్యపేట, లింగాల, వేమవరం, కంభంపాడు, కాకరవాయి, తాళ్లూరు, మాచినేనిపాలెం, వత్సవాయి, వేములనర్వ, దబ్బాకుపల్లి, పెంట్యాలవారిగూడెం, పోలంపలి, పోచవరం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

వాహనదారులకు ఇక్కట్లు



పెనుగంచిప్రోలు: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ముచ్చింతాల సమీపంలోని గండివాగు అనిగండ్లపాడు వద్ద కూచివాగుకు వరదనీరు రావడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సమీపంలోని పంట పొలాలు నీట మునిగాయి. పెనుగంచిప్రోలు–ముండ్లపాడు వద్ద చెరువు అలుగుల్లో వరదనీరు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తోటచర్ల–వెంకటాపురం మధ్యలో నవాబుపేట చెరువుకు గండిపడి వాగు చప్టాపై నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి.



మక్కపేట గాంధీజీ కళావేదిక వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో వద్ద..



కంచికచర్లలో గణనాథుడికి పూజలు చేస్తున్న ఎస్ఐ బోనగిరి రాజు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు



జగ్గయ్యపేటలో వినాయకుడికి పూజలు చేస్తున్న చైర్మన్ ఆర్.రాఘవేంద్ర దంపతులు, భక్తులు



నందిగామ ముక్కోటి మహామండపంలో కొలువుదీరిన వినాయకుడు

కొలువుదీరిన గణనాథులు

జగ్గయ్యపేట: వినాయక చవితి వేడుకలను జగ్గయ్యపేట మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేక మంటపాలు ఏర్పాటు చేసి వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. వేదాద్రిలోని నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేకంగా గణనాథుని ఏర్పాటు చేసి పూజలు చేశారు. జయంతిపురం, ముక్త్యాల, తిరుమలగిరి, ధర్మవరప్పాడుతండా గ్రామాల్లో పలు ఆకృతులలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. బ్రాహ్మణబజార్, అలాసపురివారివీధి, చాకలిబజార్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాల మంటపాలు ఆకట్టుకున్నాయి.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: గణపతి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వత్సవాయి. దబ్బాకుపల్లి, పోలంపల్లి, కంభంపాడు, లింగాల, చిట్టేల, మక్కపేట, భీమవరం, మంగొల్లు తదితర గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు సూచించారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

పెనుగంచిప్రోలు: వినాయకచవితి పర్వదినాన్ని మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తిరుపతమ్మ ఆలయం వద్ద మట్టి గణనాధునికి నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు పూజల్లో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు దంపతులు, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, పి.వెంకటరమణ, సిబ్బంది, భక్తులు, ఆలయ వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన చవితి పందిళ్లలో భక్తులు గణేషుడి విగ్రహాలను ఉంచి రెండోరోజు ఆదివారం విశేష పూజలు చేశారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మండల ప్రజలు వినాయకచవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లో చలువ పందిళ్లువేసి గణేషుడి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. కంచికచర్లలోని నెహ్రూబొమ్మ సెంటర్, పెట్రోలు బంక్‌సెంటర్, పశువుల ఆసుపత్రి రోడ్డు, తీగెల బజార్, రామాలయం పెద్ద బజార్, హనుమాన్‌పేట, పోలీస్ స్టేషన్ సెంటర్, వసంతకాలనీ, మోడల్‌కాలనీ, ప్రణీత కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్వామివారి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కీసరలో శ్రీశివశంకర శివాలయం, ఆంజనేయస్వామి, వినాయకునిఆలయాల్లో కమిటీ సభ్యులు మాజీసర్పంచి పరిటాల వీరభద్రరావు, పరిటాల రాము, ఉగ్ర నరసింహారావు, కుక్కల నాగేశ్వరరావు, నరసింహారావు తదితరులు వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి విశేష పూజలు చేశారు. మున్నలూరు, కునికెనపాడు పరిటాల, గండేపల్లిలో కమిటీ సభ్యులు వినాయకుని విగ్రహాలు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ బోనగిరి రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు వేమా సురేష్‌బాబు, డి.గురవయ్య, పూర్ణచంద్రరావు, రాంబాబు, లగడపాటి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి తదితరులు ఆయా మండపాలను సందర్శించి వినాయకుడికి పూజలు చేశారు.



జగ్గయ్యపేట స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడిని ఊరేగిస్తున్న భక్తులు



ధర్మవరప్పాడు తండాలో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు



కంచికచర్ల పశువుల ఆస్పత్రి రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద భక్తులు

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్ : వినాయకచవితి వేడుకలను జగ్గయ్యపేట పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. వాడవాడలా చలువపందిళ్ల వేసి వినాయకునికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బంగారుకొట్ల సెంటర్‌లోని విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలోని గణనాధుని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. చెరువుబజారులోని నీళ్ల ట్యాంకుల వద్ద కోటి ఫ్రెండ్స్, కోదాడ రోడ్డు మార్కెట్‌యార్డు ఎదురుగా రాయల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి విగ్రహాలు భక్తులను ఆకట్టుకున్నాయి. యూత్ సభ్యులు కోటి, నాగయ్య, రామకృష్ణ, బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్, కీసర గోపి, గరికె శ్రీను, పి.రాంబాబు, షేక్ బాజీ, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.



పేట బ్రాహ్మణబజార్‌లో పూజలు చేస్తున్న భక్తులు


నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్ : వినాయకచవితి వేడుకలను నందిగామ పట్టణం, మండలం, చందర్లపాడు మండలంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయా వార్డుల్లో, గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు మండపాల నిర్వాహకులు తెలిపారు.



పెనుగంచిప్రోలులో వినాయకుడికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు





అలాసపురివారివీధిలో .. పేట చెరువుబజారులో



కంచికచర్ల వసంతకాలనీలో...



జగ్గయ్యపేట మార్కెట్ యార్డు ఎదురుగా ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం



కంచికచర్లలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

విగ్రహం ధ్వంసం చేసినవారి అరెస్ట్‌కు డిమాండ్

కంచికచర్ల : కీసర నేషనల్ హైవేపై ఏర్పాటు చేసిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి ధ్వంసం చేశారు. దీంతో కీసర రహదారిపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఆందోళన చేశారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడేవారు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌వద్ద నిరసన ప్రదర్శన చేసి, ఎస్ఐ బి.రాజుకు వినతిపత్రం అందజేశారు. వైస్ ఎంపీపీ బి.మల్లికార్జునరావు, వేల్పుల రమేష్, పరిటాల రాము, వేమా సురేష్‌బాబు, కె.రామకృష్ణ, ఎం. మధుబాబు, శంకర్, చింతా రవీంద్రనాథ్, బుడ్డి సత్యనారాయణ, కె.పెదబాబు, జి.సాంబశివరావు, ఎం.కోటిబాబు, మార్త శ్రీనివాసరావు, గురవయ్య, సృజినీకుమార్, యోహాను, ఎం.పాండు, కె.అశోక్ పాల్గొన్నారు.



హైవేపై నిరసన ప్రదర్శన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఐ

మునేటికి 65 వేల క్యూసెక్కులు



నందిగామ టౌన్: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు మున్నేటికి వరదనీరు క్రమంగా పెరుగుతోంది. శనివారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి భారీగా వరదనీరు చేరుతుండటతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్నేటికి ఎగువ నుంచి 65వేల క్యూసెక్కుల వరద నీరు చేరుతోందని అధికారులు చెబుతున్నారు. వరద ప్రవాహం పెరిగితే విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపైకి వరద నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

డివిజన్‌లో 425.2 మిల్లీమీటర్ల వర్షపాతం

కంచికచర్ల : అల్పపీడన ప్రభావంతో నందిగామ డివిజన్‌లో వర్షాలు కురుస్తున్నాయి. డివిజన్‌లో ఆదివారం 425.2మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. కంచికచర్లలో 55.0మిల్లీమీటర్లు, నందిగామలో 63.8, చందర్లపాడులో 50.2,వీరులపాడులో 77.0, జగ్గయ్యపేటలో 51.2, పెనుగంచిప్రోలులో 69.8, వత్సవాయిలో 58.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో పంటపొలాలు నీటమునిగాయి.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: భారీవర్షాలకుతోడు ఎగువనుంచి వరద నీరు వస్తుండటంతో మండలంలోని వైరాకట్ట లేరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముందు జాగ్రత్త చర్యగా అధికారులు వీరులపాడు–నందిగామ మండలాల మధ్య రాకపోకలను నిలిపివేశారు. వెల్లంకిలోని లోతట్టు ప్రాంతాలను తహసీల్దార్ రాజకిషోర్ సందర్శించారు.



వీరులపాడు మండలం దొడ్డదేవరపాడు వద్ద కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



వరద ఉధృతికి దెబ్బతిన్న వత్సవాయి మండలంలోని చిల్లకల్లు మంచినీటి పథకం



అనిగండ్లపాడు మంచినీటి పథకం మోటార్ల వద్ద జేసీబీతో పూడిక తీయిస్తున్న పంచాయతీ సిబ్బంది



జగ్గయ్యపేట పట్టణం విలియంపేటలో ట్యాంకర్ల వద్ద మంచినీరు పట్టుకుంటున్న ప్రజలు



కంచికచర్ల మండలం కీసర మునేటి ఒడ్డున పైపులైన్‌కు వెల్డింగ్ చేస్తున్న కార్మికుడు



వత్సవాయి: వరద ఉధృతికి దెబ్బతిన్న లింగాల మంచినీటి పథకం పైపులైన్

కన్నీటి కష్టాలు

భారీవర్షాలతోపాటు వరదనీటి ఉధృతికి జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని పలుగ్రామాల మంచినీటి పథకాలు దెబ్బతిన్నాయి. మోటార్లు, పైపులైన్లు, విద్యుత్‌స్తంభాలు కొట్టుకుపోయాయి. జగ్గయ్యపేట మండలంలోని బూదవాడ, తక్కెళ్లపాడు, రెడ్డినాయక్‌తండా, అన్నవరం, కె.అగ్రహారం, బలుసుపాడు, అనుమంచిపల్లి గ్రామాల పరిధిలో పాలేటిలో ఏర్పాటు చేసిన మంచినీటి పథకాల పైప్‌లైన్లు, మోటార్లు, జనరేటర్లు, విద్యుత్ లైన్లు కొట్టుకుపోయాయి. వత్సవాయి మండలంలో చిల్లకల్లు, లింగాల, కంభంపాడు, పోలంపల్లి, ఇందుగపల్లి మంచినీటి పథకాలు మరమ్మతులకు గురికాగా, లింగాల కాజ్‌వేపై నుంచి వత్సవాయితోపాటు పోచవరం, దబ్బాకుపల్లి, లింగాల గ్రామాలకు వేసిన పైపులైన్ కొట్టుకుపోయింది. పెనుగంచిప్రోలు వద్ద మునేరులో ని మోటార్లు, పైపులైన్లు వరదకు కొట్టుకుపోయాయి. కొళ్లికూళ్ల వద్ద మునేరులోని పథకానికి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో జగ్గయ్యపేట మండలంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు రూ.2కోట్ల మేర నష్టం వాటిల్లింది. మంచినీటి పథకాలు పనిచేయకపోతుండటంతో పలు గ్రామాల్లోని సర్పంచులు ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. పాలేటి వరద ఉధృతికి జగ్గయ్యపేట పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే హెడ్‌వాటర్‌వర్క్సులోని మోటార్లు, పైపులైన్లు నీటమునిగాయి. కొన్ని యంత్రపరికరాలు కొట్టుకుపోయాయి. ఫిల్టర్ బెడ్, ట్యాంక్ విభాగాల్లో ఇసుక, మట్టి మేటవేశాయి. దీంతో రూ.2కోట్ల మేర నష్టం వాటిల్లింది. హెడ్‌వాటర్‌వర్క్సులోని 60హెచ్‌పీ మోటారుకు మున్సిపల్ చైర్మన్, అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి పట్టణంలోని 10వార్డులకు పైపులైన్ల ద్వారా నీటి సరఫరా చేపట్టారు. మిగిలిన 21వార్డులకు 11ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నందిగామ మున్సిపాలిటీకి సంబంధించి కీసర వద్ద ఉన్న మంచినీటి పథకం, పైప్‌లైన్లు దెబ్బతినడంతో రూ.1.50కోట్ల నష్టం వాటిల్లింది. వైరాకట్టలేరు వద్ద విద్యుత్ లైన్ తెగిపోవడంతో మూడు విద్యుత్ మోటార్లు పనిచేయక చౌటపల్లి, వీరులపాడుకు నీటి సరఫరా నిలిచిపోయింది. కంచికచర్ల మండలం గండేపల్లి, కీసర, పెండ్యాల తదితర గ్రామాలకు నీటిని అందించే మోటార్లు నీటమునిగాయి. చెవిటికల్లు పైలెట్ ప్రాజెక్టు కూడా నీటమునిగింది. నీటికోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

–జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, కంచికచర్ల, నందిగామటౌన్, వీరులపాడు



ముచ్చింతాల వద్ద కొట్టుకుపోయిన పైపులైన్



పెనుగంచిప్రోలులో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న జనం



వత్సవాయి : పోలంపల్లి వద్ద దెబ్బతిన్న పైప్‌లైన్లు



మరమ్మతులకు గురైన పేట హెడ్‌వాటర్ వర్క్స్



మోటార్లు రిపేరు చేస్తున్న పేట మున్సిపల్ సిబ్బంది



పేటలో సాగుతున్న పైపులైన్ పునరుద్ధరణ పనులు

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన



వేదాద్రి(జగ్గయ్యపేట): వినాయకుడి విగ్రహ నిమజ్జనాలకు సంబంధించి వేదాద్రి గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ సమీపంలోని కృష్ణానది వద్ద చేపట్టిన ఏర్పాట్లను ఇన్‌చార్జి సీఐ వైవిఎల్ నాయుడు ఆదివారం పరిశీలించారు. నిమజ్జనాల సందర్భంగా నది వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీఐ తెలిపారు. కృష్ణానదికి వరద వస్తుండటంతో భక్తులు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. ఆలయం ఆధ్వర్యంలో పంటు ఏర్పాటుతోపాటు గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ సూర్యశ్రీనివాస్, పోలీసు సిబ్బంది, అధికారులు ఉన్నారు.

బాధితులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే

జగ్గయ్యపేట అర్బన్: వరద ముంపునకు గురై నష్టపోయిన ప్రతిఒక్కరికి న్యాయం చేస్తామని, వారందరికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రతో కలిసి తొర్రగుంటపాలెంలో ముంపు ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. కమిషనర్ ఎం.రామ్మోహనరావు, కౌన్సిలర్లు పేరం సైదేశ్వరరావు, గొట్టి నాగరాజు, సంగెపు బుజ్జిబాబు, పూసాల పుల్లారావు పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే తాతయ్య స్థానిక ఊరచెరువును పరిశీలించారు.



తొర్రగుంటపాలెంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య